www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 27 నవంబర్ 2024

5



హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - మామిడికుదురు

హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టామని నగరం పిహెచ్‌సి వైద్యాధికారి కెజె.ప్రశాంత్ తెలిపారు. మొగలి కుదురులో మంగళవారం హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసు పరిశీలించారు మండల పరిధిలో 30 మంది గర్భిణులు ఉన్నారని, ఐదు హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు ఉన్నాయన్నారు. హైరి స్క్ కేసులన్న గర్భిణుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్.సత్యవతి, ఎఎన్ఎం మల్లీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి ఎం.దీపిక, ఆశ వర్కర్లు సేవలందించారు



హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసు పరిశీలిస్తున్న వైద్యాధికారి కెజె.ప్రశాంత్

మహాధర్నా విజయవంతం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కలెక్టరేట్ వద్ద ధర్నా
- పాల్గొన్న సిఐటియు, ఎఐటియుసి, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఈపిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం సిఐటియు, ఎఐటియుసి, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా విజయవంతమైంది. ఈ మహాధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.బలరాం, జి.దుర్గాప్రసాద్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సంకీర్ణ ప్రభుత్వం అయినా తమ విధానాల్లో మార్పు లేదని స్పష్టంగా ప్రకటించిందన్నారు. కుక్కతోక వంకరని మరోసారి మోడీ ప్రభుత్వం రుజువు చేసుకుందన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన ప్రభుత్వాలు రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తున్నాయని వారు ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లోనూ ఈ నిరసన వెల్లువ సాగుతోందని వారు తెలిపారు. సర్వ సంపదలు సృష్టించేది కార్మికవర్గం, ప్రజలకు తిండిపెట్టేది రైతాంగం కాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లు పెట్టుబడిదారులకు అనుకూలమన్నారు. గత 10 ఏళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టి కార్పొరేట్లకు కట్టబెడుతుందని వాపోయారు. విశాఖస్టీల్ ప్లాంట్‌తో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు బిజెపి ప్రభుత్వం కట్టబెడుతోందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ ప్రయివేటు అమ్ముతాం లేదా మూసివేస్తాం అనే విధానాన్ని బిజెపి అమలుచేస్తోందన్నారు. .

ఈ సంవత్సరం బడ్జెట్లో 500 ప్రయివేటు కంపెనీలకు యాజమాన్యం ఇవ్వవల్సిన జీతాలు కేంద్ర ప్రభుత్వమే ఇంటర్నెట్ షిప్ పేరుతో కార్మికుడికి నెలకు రూ.5వేలు ప్రోత్సాహాలను అమలుచేస్తున్నదన్నారు. కార్మికులకు నెలకు ఇవ్వవల్సిన రూ.26వేల కనీసవేతనాన్ని ఇవ్వడంలేదని అన్నారు.

ఎఐటియుసి పూర్వ జిల్లా అధ్యక్షులు కె.సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ట్రెజరర్ కె.కృష్ణవేణి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి మలకా సుభాషిణి మాట్లాడుతూ కనీస వేతనం ఏమాత్రం పెంచలేదన్నారు. కాని ధరలు రెట్టింపుగా పెరిగాయన్నారు. సుప్రీంకోర్టు చెప్పినా స్కీం కార్మికులు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను 'కార్మికులుగా' గుర్తించడంలేదని వాపోయారు. కార్మికులు ఎంత కాలం పనిచేసినా పర్మినెంట్ చేయకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్స్, ట్రయినీ, గౌరవ వేతనం లాంటి పేర్లతో కార్మికులను అత్యంత దోపిడి చేస్తున్నారన్నారు. కడుపుమండి కార్మికులు తిరగబడతారని పెట్టుబడిదారులకు తెలుసని అందుకే 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కేంద్రం మార్చిందని వాపోయారు. స్వాతంత్ర్యం ముందు నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల సారాన్ని పిండి కార్మికులను బానిసలుగా పనిచేయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రచేస్తున్నాయన్నారు. లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ దేశమైన భారతదేశంలో కార్మిక వర్గం దీనిని అడ్డుకోవాలన్నారు. రైతులతో కలిసి ఐక్యంగా పోరాడితేనే మన లక్ష్యం సాధించగలమని 2021 లో రైతుల చారిత్రాత్మక పోరాట ఫలితంగా మూడు రైతు నల్ల చట్టాలు రద్దుఅయ్యాయని అన్నారు. కాని డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయడంలేదన్నారు. లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలకు పట్టడంలేదని వాపోయారు. ఉపాధి చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచి ఈ సంవత్సరం 6 కోట్ల మంది లబ్దిదారులను తగ్గించిందన్నారు. ఉపాధి హామీకి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మిక వర్గాన్ని చీల్చాలని బిజెపి, ఆర్‌ఎస్ఎస్ నిరంతరం ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడమే మన మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎదిరించాలి. ఈ విధానాలను ప్రతిఘటించడం ఒక్కటే మన ముందున్న పరిష్కార మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు నిమ్మకాయల వెంకటేష్, పొలమూరి శ్రీనివాసరావు, ఊటాల వెంకటేష్, సిహెచ్.శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీనివాసరావు, బండి వెంకటలక్ష్మి, బుంగ సత్యనారాయణ, బండి ఈశ్వరి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ

ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి మంగళవారం నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను సందర్శించి ఉపాధ్యాయులను కలుసుకున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులను కోరారు. విద్యా రంగ సమస్యలు పట్ల శాసన మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా నిలుస్తానని, ప్రభుత్వ రంగాలు కాపాడడానికి నిజాయితీగా పోరాడతానని ఓటర్లకు హామీ ఇస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. 16 హైస్కూల్స్, ఒక జూనియర్ కళాశాల, పీజీ సెంటర్‌ను సందర్శించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోపిమూర్తి వెంట యుటిఎఫ్, జానవిజ్ఞాన వేదిక నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, కాంటాక్ట్ ఆధ్యాపక సంఘ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న గోపిమూర్తి

మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం పురపాలక సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షులు వేదంశెట్టి రామచంద్రపురం పురపాలక సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షులు గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షత మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాతను డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ఔన్నత్యాన్ని కమిషనర్ నాయుడు వివరించారు. అనంతరం సమావేశంలో బ్లీచింగ్ కొనుగోలుకు పత్రికల ప్రకటన బిల్లులు చెల్లించుటకు సభ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం నివాళులర్పిస్తున్న ఛైర్పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు తదితరులు

7న మెగా పేరెంట్స్ మీట్ : కలెక్టర్

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

వచ్చే నెల డిసెంబర్ 7న శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు విద్యాశాఖ ఆధ్వర్యంలోకలెక్టర్ అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలలవారీగా నిర్వహించనున్న మెగా సమావేశాల నిర్వహణ విధి విధానాలు గూర్చి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మెగా సమావేశాల నిర్వహణకు మండల స్థాయిలో బందాలను ముందస్తు ఏర్పాట్ల నిమిత్తం నియమించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాలను సిఎం చంద్రబాబు డిసెంబర్ 7న బాపట్ల జిల్లా నుంచి ప్రారంభిస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం గ్రాంటును విడుదల చేయనున్నదని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ఐదు పాఠశాలలను తీసుకుని హెల్త్ క్యాంపులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం బాషా, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, సర్వ శిక్ష అభియాన్ సెక్టోరియల్ అధికారులు, విద్యా సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ డిఇ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ నందు అంబేద్కర్ చిత్ర పటానికి కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, కలెక్టరేట్ సిబ్బంది కాశీ విశ్వేశ్వరరావు, మురళీకృష్ణ, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. **అల్లవరం:** గోడి గ్రామ పంచాయతీ లోసర్పంచ్ తోట శ్రీదేవి, మండల టిడిపి అధ్యక్షులు, దెందుకూరి సత్తిబాబు రాజు తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల తో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు కాండ్రేగుల వాణీ అచ్యుతం, తోట నరసింహం తదితరులు పాల్గొన్నారు. బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమ ంలో పంచాయతీ కార్యద్శి సింగంపల్లి దుర్గ శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పలువురు ప్రముఖులు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్.కొత్తపల్లిలో మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకటబాబ్జి అధ్యక్షతన నిర్వహించి న కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ కుంచే చిట్టి కుమారి, దళిత నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు సాగాలని సర్పంచ్ చిట్టికుమారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు కుంచే చిన్ని,నల్లా సింహాద్రి, మాదే శ్రీనివాస్, గోసంగి శ్రీను, కొంకి బాలకృష్ణ, గిడ్ల రమేష్, రవ్వ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **పి.గన్నవరం:** ఓటు హక్కు ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోగలుగుతున్నామని ఎవరైనా రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేస్తే ఓటుతో ప్రజలు సమాధానం చెబుతారని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఎంఎల్ఎ గిడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని అందరూ గౌరవించి, ఆచరిద్దామని తహశీల్దార్ పి.శ్రీ పల్లవి అన్నారు. ప్రజలందరూ లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎంపిడిఒ కెవి.ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి జి.నాగలక్ష్మి శ్రీనివాస్, సర్పంచ్ బొండాడ నాగమణి, పరిపాలనాధికారి విఎస్‌వి.శర్మ, కె.జయలలిత, ఆర్.రామకృష్ణ, శ్రీనివాస్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆలమూరు** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఎంపిడిఒ, ఇంచార్జ్ డిఎల్‌పిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ ఎం.మెహర్ ప్రకాష్, ఎపిఒ జి.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపిడిఒ బికెఎస్ఎస్. వెంకటరామన్, మండల పరిషత్ పరిపాలనాధికారి, వి.రామ స్వరూప్, సిబ్బంది పి.అనిల్ కుమార్, ఆర్.ఎస్.ప్రత్యూ ష తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపేట గ్రామం కమ్మిరెడ్డిపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్ఎ బండారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో కంఠంశెట్టి శ్రీనివాస్ ,బూసి జయ లక్ష్మి భాస్కరరావు, ధరణాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రియదర్శిని బాలవిహార్ విద్యార్థులచే స్కూలు అసెంబ్లీలో రాజ్యాంగ ప్రతిజ్ఞను చేయించారు. కరస్పాండెంట్ బుద్ధచంద్రదేవ్, తదితరులు పాల్గొన్నారు.



మండలపరిషత్ సమావేశంలో రాజ్యాంగంపై మాట్లాడుతున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి



ఎన్.కొత్తపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ చిట్టికుమారి, నాయకుల నివాళి

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

అమలాపురం: రాజ్యాంగం నేడు మనువాద మతోన్మాదులు మార్చి మనుస్మృతిని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారి చెర నుంచి పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాలు నాయకులు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న మనువాద మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. రాజ్యాంగంపై జరుగుతున్న దుర్మార్గమైన మతోన్మాద దాడులను వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమాలు చేయ్యాలిసిన అవశ్యకత మనందరిపై ఉందన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు నిమ్మకాయల వెంకటేష్, పొలమూరి శ్రీనివాసరావు, ఊటాల వెంకటేష్ శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీనివాసరావు, బండి వెంకట లక్ష్మి, బుంగ సత్యనారాయణ, బండి ఈశ్వరి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నేతల నివాళి



మాట్లాడుతున్న రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల

దేశ ప్రజలందరికీ శిరోధార్యం భారత రాజ్యాంగం: ఆర్‌డిఒ

రామచంద్రపురం: దేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగం శిరోధార్యమని రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అఖిల మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలో దృఢమైనదని దాన్ని మార్పులు చేర్పులు చేసేందుకు పార్లమెంటుకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఇటీవల భారత రాజ్యాంగంలోని లౌకికవాదంపైనా, సార్వభౌమత్వంపైనా వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టు వేసిందన్నారు. ఇది భారత రాజ్యాంగం యొక్క విజయమని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాజ్యాంగం రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సుభాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో రాజ్యంగ దినోత్సవాన్ని ఆపార్టీ ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ కొలమూరు శివాజీ, కౌన్సిలర్స్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దళిత చైతన్య వేదిక నాయకులు తాటిపాక సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. మండలంలో జరిగిన కార్యక్రమాల్లో రాజోలు వైస్ ఎంపిపి పోలుమూరి శ్యాంబాబు, మట్టా సురేష్ కుమాం తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం :** నగర పంచాయతీ పరిధిలో డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు అధ్యకతన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి.ఈ వేడుకల్లో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రాజ్యాంగ దినోత్సవ వేడుకను ఎంపిడిఒ కె.రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రహదారుల అభివృద్ధితో తొలగనున్న అవస్థలు

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం - అంబాజీపేట ప్రధాన ఆర్అండ్‌బి రహదారి రూ.30 కోట్లు ప్యాకేజీలో భాగంగా సుమారు 6 కిలోమీటర్ల రోడ్డుకు రూ.8కోట్లతో పనులు చేపడుతుండటంతో రెండు మండలాలు ప్రజలు, వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి కనీసం మరమ్మతులకు నోచుకోని వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం రోడ్ల ఆధునికీకరణ లో బాగంగా నాణ్యతతో నిర్మిచాలని కోరుతున్నారు. ఏడు మీటర్ల వెడల్పుతో మూడు రోడ్ల జంక్షన్ నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకూ సిసి రోడ్లు, దిగబడిపోతుండటంతో కాంక్రీటు వాల్ తో పటిష్ట పరచాలని స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు విన్నవిస్తున్నారు.



పి.గన్నవరం లో ఆర్అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు

బోటు రేసు నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

పర్యాటకులకు ప్రకృతి రమణీయతతో కూడిన చక్కటి వాతావరణంలో మానసిక ఉల్లాసాన్ని సాంత్వనను అందించేందుకు ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల ఎగువ భాగం (అప్ స్ట్రీమ్)నందు బోటు రేసు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా పర్యాటక కమిటీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలో పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లోబోటింగ్ టెర్మినల్స్ ఏర్పాటు, కోటిపల్లి నందు టూరిజం రిసార్ట్ ఆపరేషన్ మేనేజ్మెంట్ నిర్వహణ పనులు, ఆత్రేయపురం లొల్ల లాకుల నందు ఫెడల్ బోట్ రేస్ నిర్వహణ అంశాల పురోగతిపై కమిటీ ఆధ్వర్యంలో సమీక్షించారు కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ మదన్ మోహన్ రావు, కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి వెంకటాచలం, డివిజనల్ మేనేజర్ పవన్ కుమార్ మేనేజర్ గంగ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మూలంగా ఈ నెల 29,30, డిసెంబరు 1, 2 తేదీల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉందని జెసి టి.నిషాంతి అన్నారు. ఈ కారణంగా జిల్లాలో వరి రైతులు తమ పంటల ను కాపాడు కునేలా అప్రమత్తం కావాలని మంగ ళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంట కోతలు కోయరాదని సూచించారు. సాధారణంగా కోతలు కోసి పనులు మీద ఉన్న ధాన్యాన్ని ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తూ మొలకలు రాకుండా, రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని వెంటనే తమకు నచ్చిన మిల్లులకు తరలించి విక్రయించుకునేలా పౌర సరఫరాల శాఖ పూర్తి సహకారాలు అందిస్తుం దన్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని కూడా మిల్లులకు ట్యాగింగ్ చేస్తారన్నారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆమె సూ చించారు. రైస్ మిల్లుల వద్ద నియమించిన కస్టోడియన్ అధికారులు అందుబాటులో ఉండి గోనె సంచులు హమాలీలు రవాణా వసతు లను రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కల్పిస్తారన్నారు. జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జిల్లా పౌరసరఫరాల అధికారి అందుబాటులో ఉండి రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని, రైతులు తమకు ఇబ్బంది వచ్చినా వెంటనే మండల జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేస్తే ఆ యొక్క సమస్యకు పరిష్కార మార్గం చూపుతారన్నారు. నూర్పుల సమస్యలను జిల్లా వ్యవసా య అధికారి దష్టికి తెచ్చి తగు పరిష్కార మార్గాలు కోరాలన్నారు. అల్లవరం, అమలాపురం, ఐ.పోలవరం మండలంలో వరి సాగు తక్కువగా ఉన్నదని ఆమె స్పష్టం చేశారు. రైతులు తుపాను బారి నుండి తమ పంటలను కాపాడుకోవాలని ముందస్తుగా సూచించామని జెసి విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో సైబర్ మోసాల నియంత్రణ : ఎస్‌పి

ప్రజాశక్తి - అమలాపురం

సైబర్ నేరాలపై అవగాహననే వాటి నియంత్రణ సాధ్యమవుతుందన్న జిల్లా ఎస్‌పి. బి.కృష్ణారావు అన్నారు.అన్నారు.మంగళవారం. స్థానిక ఏ యెండూరి కన్వెన్షన్ హాల్ నందు ఎస్‌బిఐ రీజినల్ బిజినెస్ ఆఫీస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా హాజరైన ఎస్‌పి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్ది సైబర్ నేరగాళ్ళు సరికొత్త రీతిలో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. వాటిపై అవగాహనతోనే సైబర్ మోసాల నుంచి తప్పించుకోవచ్చన్నారు.కరపత్రాల్లో సైబర్ నేరగాళ్ళ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. వీటిపై అవగాహన పెంచుకొంటే సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడకుండా మనల్ని మనం కాపాడుకోని, మన డబ్బులను మనం కాపాడుకోవచ్చన్నారు. అనంతరం స్టేట్ బ్యాంకు రిజినల్ మేనేజర్ ఎమ్‌వివి.కృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు ఎవరైనా ఫోన్ చేసినప్పుడు తమవ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదన్నారు. వీటిపై ఏవిధమైనా అనుమానం కలిగితే 1930 నెంబర్ కు కాల్ చేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని బైపాసు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిత్రాడ గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్ భార్య సమత, తల్లి సాయికుమారి, ఏడాది లోపు చిన్నారితో కలిసి మోటారు సైకిల్‌పై గొల్లప్రోలు మండలం తాటిపర్తి అవధూతల ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పిఠాపురం జాతీయ రహదారి సీతయ్యగారితోట సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో కిందపడిపోయిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగిలిన ముగ్గురు గాయాలపాలయ్యారు. వీరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట మండలం కొత్తూరు రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన చింతల శ్రీను(45) గాయపడ్డాడు. క్షతగాత్రుడిని గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట శివారున ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న ఆ వ్యక్తికి మంగళవారం శస్త్ర చికిత్స చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. లోనికి తీసుకెళ్లిన అర్ధ గంటలోపే ఆ వ్యక్తి గుండెపోటు గురయ్యి మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు వెల్లడించారు. అయితే ఆస్పత్రి నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబీకుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో మంగళవారం ఇసుకను తరలిస్తున్న లారీని ఎస్ఐ ఎస్.రాము తనిఖీ చేశారు. ఇసుక తరలింపునకు ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాత సూరంపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో లీటరు సారా స్వాధీనం చేసుకుని ఒక మహిళను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్నానానికి దిగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోరుకొండ

చెరువులో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన చెరువులో పిల్లి శ్రీనివాసరావు(40) స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు మతి చెందాడని పోలీసులు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నడకుదురు గొడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - కరప

నడకుదురులో ఒక గొడౌన్‌లో మండల సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ లు చేపట్టారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ కు వచ్చిన సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. గొడౌన్‌లో పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించలేదని తోట సుధీర్ తెలిపారు. పూర్తి స్థాయి తనిఖీల అనంతరం వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

ఉచిత ఇసుక పేరుతో దోపిడీ

- మండలంలో రాత్రులు రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో ఉచిత ఇసుక పేరుతో దోపిడీ జరుగుతోంది. తాడిపూడి వశిష్ట గోదావరి నది నుండి ఇసుక రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకాసురులు రవాణా చేస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో మండలంలోని తాడిపూడి, ఇసుక ర్యాంపు నుంచి ఉచిత ఇసుక పేరుతో రాత్రులు జెసిబి సాయంత్రం వందలాది లారీలతో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దీనిని నియంత్రించవలసిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడంతో వీరి వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. వీరిని అడ్డుకొనే నాథుడే కరువయ్యారు. మండలంలోని అధికార పార్టీ నాయకుడు అండదండలతో ఇసుక మాఫియా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

సామాన్యుడికి ఇసుక కావాలంటే..

సామాన్యుడికి ఇసుక కావాలంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న తరువాత సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మరియు పంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇసుకవసరమైతే అనుమతులు ఇస్తారు. ఇది ఉచిత ఇసుక పరిస్థితి. దళారులకు మాత్రం ఎటువంటి అనుమతులు అవసరం లేదు. వారు ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు తవ్వతున్న అటువైపు ఈ అధికారి కూడా కన్నెత్తి చూసే సాహసం చేయడు. ప్రభుత్వం మాత్రం ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను నేరుగా ట్రాక్టర్లతో నది నుంచి తీసుకెళ్లవచ్చని చెబుతున్న ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. నదిలో ఇసుక ఎగుమతులు కూలీల ద్వారానే చేయాలని నిబంధనలు ఉన్న ఇక్కడ ఇవేమీ కానరావు. దీంతో వందలాది లారీలతో ఇసుకను తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

సామాన్యుడికి ఇసుక కావాలంటే అనుమతి తప్పనిసరిగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. లారీ ఇసుకను బయట ప్రాంతాలు తీసుకెళ్లి రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు విక్రయిస్తున్నారు. నాయకుల హవా అండదండలు పుష్కలంగా ఉండడంతో లారీలను ఆపే సాహసం ఏ అధికారి చేయడు.

పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు

ఒకపక్క ఇసుక కొరతతో కార్మికులు పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాలకు విలువైపులా గౌతమి, వశిష్ట గోదావరి నదులలో ఇసుక పుష్కలంగా ఉన్న ఇల్లు కట్టుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చుపెట్టి ఇసుక కొనుక్కుని పరిస్థితి నెలకొంది. దీనిపై దృష్టి సాధవలసిన రెవెన్యూ, మరియు హెడ్ వర్క్ అధికారులు ముడుపులు తీసుకుని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణ లు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నదా అధికారులు కలగజేసుకుని అక్రమ ఇసుక తరలి స్తున్న వారిపై చర్యలు తీసుకొని సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందేలా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.



అనుమతులు లేకుండా వెళుతున్న ఇసుక లారీ

చర్యలు తీసుకుంటాం

మండలంలోని ఆత్రేయపురం, అంకంపాలెం, నార్కెడిమిల్లి, వద్దిపర్రు గ్రామాల ఇసుక ర్యాంపులకే అనుమతులు ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తవ్వకాలకు అను మతి.మిగతా గ్రామాల్లో ఎక్కడైనా ఇసుక తవ్వకాలు జరిగితే వాహనాలను సీజ్ చేసి యజమానులపై చర్యలు తీసుకుంటాం.

-టి.రాజేశ్వరరావు, తహశీల్దార్ ఆత్రేయపురం



ఎంపిక కాబడిన నూతన కార్యవర్గ సభ్యులు

'ఎల్ఐసి' నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి అమలాపురం రూరల్

స్థానిక మేథా గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన ఎల్ఐసి అమలాపురం బ్రాంచ్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.డివిజన్ ప్రెసిడెంట్ వై .విజేశ్వరరావు నూతన కార్యవర్గ వివరాలు తెలిపారు. బ్రాంచ్ అధ్యక్షులు సానపోయిన వీరభద్రరావు, సెక్రటరీ ఎన్.వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివ స్వామి, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, కమిటీ సభ్యులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రవి కిషోర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, డివిజన్ ఇంచార్జ్ వీరభద్రం, డిఒ యూనియన్ సెక్రటరీ ఎన్.సుబ్రహ్మణ్యం, జివిఎస్ శర్మ పాల్గొన్నారు.

పశుగణన సర్వేపై పర్యవేక్షణ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని మాచర, కోరుమిల్లి గ్రామాల్లో బ్రు సెల్లో సిస్ టీకాలు , 21 జాతీయ పశు గణన సర్వేను ఆలమూరు పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ ఎల్.అనిత మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం మాచర పశు వైద్యశాలను సందర్శించి పశు గణనపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు, పశు వైద్య సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

అగ్ని ప్రమాద బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

అగ్ని ప్రమాద బాధితులను మంగళవారం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పరామర్శించారు. ఐ.పోలవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బిసి పేటలో ఆదివారం రాత్రి ఇళ్ల చంద్ర మోహన్ ఇంటిలో మంగా లక్ష్మి వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ద్వారా గ్యాస్ లీక్ అయ్యి మంటలు రావడంతో ఇంటి లో ఉన్న సామగ్రి ఆహుతైంది. ఈ సందర్భగా స్థానిక ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మంగళవారం నిరాసులైన కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి రూ.20వేల నగదు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం పితాని అప్పారావు ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను పరామర్శించారు. అయన వెంట రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగి సూరిబాబు రాజు, పి.శివ, ఆర్.స్వామి నాయుడు, డి.రాంబాబు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పి.గన్నవరం

104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో కషిచేస్తానని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ హామీ ఇచ్చారు. పి.గన్నవరం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం 104 ఉద్యోగులు ఎంఎల్ఎ ను మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పిహెచ్‌సి ల అనుసంధానంలో విధులు నిర్వహించాలని తదితర న్యాయ సమ్మతమైన డిమాండ్ ల పరిష్కారం కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ వినతిపత్రం సమర్పించినవారిలో కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు,పి.గన్నవరం 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

28న అంగరలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎపి ఎన్‌జివోస్ అసోసియేషన్ మండపేట యూనిట్ అధ్యక్షులు జె మల్లికార్జునుడు, కార్యవర్గం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలు వరకు వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు.

పినిపే శ్రీకాంత్‌కు బెయిల్ మంజూరు

ప్రజాశక్తి - అమలాపురం

అయినవిల్లికి చెందిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంగతి తెలిసిందే. మంగళవారం శ్రీకాంత్ కు కోర్ట్ లో బెయిల్ మంజూరు చేశారు. రెండవ నిందితుడు ధర్మేష్ కు ఇంకా బెయిల్ పిటిషన్ దాఖలు చేయ లేదు. ఈ కేసుకు సంబంధించి తాజా అఫిడవిట్ లో పోలీసులు మూడో నిందితుడుగా జానీ అనే వ్యక్తి పేరు చేర్చారు.

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - యానాం

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ,రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రాంతీయ పరిపాల నాధికారి కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ కెవివి.సత్యనారాయణలు మాట్లాడారు. మోడీ పాలనలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని, నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిపోయిందన్నారు. పరిశ్రమల్లో కార్మికులు బానిసలకంటే దారుణమైన రీతిలో పని భారంతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు దీనికి భిన్నంగా లేవని, ఎన్నికల ముందు ప్రజా సమస్యలపై ఉపన్యాసాలు దంచిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

'జితేంద్ర' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కొత్తపేట



పాల్గొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు

స్థానిక ఆర్ఎస్ బిసి కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. రక్త దాన శిబిరానికి తమ కళాశాల లైన సిద్దార్థ, శతాబ్ది విద్యార్థులు ముందుకు వచ్చి రక్త దానం చేయడం అభినందనీయం అన్నారు. మరొక అతిథి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు మాట్లాడారు. కార్యక్రమానికి విచ్చేసిన వాసంశెట్టి సత్య, పితాని భానుచందర్, కముజు వెంకటేశ్వరరావు, ఆరుమిల్లి సాయిబాబాలను ఆర్ఎస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జితేంద్ర సేవా ఫౌండేషన్ ప్రతినిధులు జోగి మురళీ కృష్ణ, రాయుడు దుర్గా ప్రసాద్, సంసాని సునీల్ కుమార్, సహస్ర బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కడలి శ్రీహరి, మాజీ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మట్టపర్తి సూర్యచంద్రరావు, తోట వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

108 సేవల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ప్రజాశక్తి - అమలాపురం

108 ఉచిత అత్యవసర సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్లో వైద్యాధికారులు 108 సమన్వయ అధికారులతో సమావేశం నిర్వహించారు. 108 అత్యవసర వైద్య సేవలకు సంబంధించి అరవిందో సంస్థ వాహన డ్రయివర్లు ఆ సంస్థతో ధర్నాకు దిగిన మూలంగా అత్యవసర వైద్య సేవలు నిలిచిపోకుండా తాత్కాలిక ప్రాతిపదికన ప్రత్యామ్నాయంగా నాలుగు చక్రాల లైట్ మోటార్ వాహన లైసెన్స్ కలిగిన వారిని జిల్లా రవాణా అధికారి సమన్వయంతో నియమిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. 12 గంటలకు ఒక షిఫ్ట్ మరో 12 గంటలు ఇంకో షిఫ్టులో వాహన చోధకులను నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో 108 అత్యవసర వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ అజయ్, జిల్లా వైద్యశాల సమన్వయ అధికారి కార్తీక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ మొబైల్ యాప్ ఆవిష్కరణ

దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అనే ఆయుష్ మొబైల్ యాప్ ను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధన్వంతరి జయంతి అక్టోబరు 29 న ప్రధాని మోడీ ఈ యాప్ ను ప్రారంభించారని ఈరోజు నుంచి ఆ యాప్ అందుబాటులోకి వచ్చింద న్నారు.

మొగళ్లమూరులో టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - అల్లవరం

మొగళ్ళమూరు గ్రామం శిరగట్లపల్లి లో టిడిపి సభ్యత్వ కార్యక్రమం అల్లవరం మండల పార్టీ అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరి గోపాలకష్ణ రాజు, రాష్ట్ర ఐ టిడిపి కార్యదర్శి కాట్రూ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల పనితీరును మెరుగు పర్చుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా వివిధ విభాగాల రెవెన్యూ ఉద్యోగులు పనితీరును మెరుగుపరచుకోవాలని జెసి టి.నిషాంతి సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో రెవెన్యూ ఉద్యోగులతో తొలిసారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సెక్షన్ల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్షన్ అధి కారులు ప్రతి ఒక్కరికీ రోజు వారీగా విధులు కేటాయిస్తూ సాయంత్రం వాటిని ఏ మేరకు పూర్తి చేసింది నివేదిక కోరాలని ఆదేశించారు. ప్రస్తుతం కొంతమంది సిబ్బందిపైనే పని భారం ఒత్తిడి ఉందని మరి కొంతమందికి విధుల పట్ల నిర్లక్ష్యం అలసత్వం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందరికీ సమాన ప్రాతిపదికన విధులు కేటాయిస్తూ పనితీరును మెరుగుపరచాలని సెక్షన్ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఇకపై ప్రతి పక్షం రోజులకు ఒక మారు సిబ్బందితో సమావేశం నిర్వహించి పనుల నిర్వహణ తీరును ఉద్యోగుల వారీగా సమీక్షిస్తామన్నారు. కార్యక్ర మంలో జిల్లా రెవెన్యూ అధికారి మదన్ మోహన్ రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.కాశీ విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు మురళీకృష్ణ, బోసు బాబు, వికాస జిల్లా మేనేజర్ జి రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ధాన్యం కొనుగోలు నిమిత్తం టేకి రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం రామచంద్రపురం ఆర్‌డిఒ డి.అఖిల పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందపల్లి సమీపంలోని, కపిలేశ్వర పురం మండలంలో, తాతపూడి ఇసుక ర్యాంపులు, కపిలేశ్వ రపురం వన్ ఇసుక ర్యాంపులను పరిశీలించి పలు సూచనలు చేశారు . స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫ్రీ శాండ్ అమలు, వాటి విధి విధానాలపై పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలతో అవగాహనా సమావేశం నిర్వహించారు. కార్యక్రమం లో తహశీల్దార్ పి. చిన్నారావు, ఎంపిడిఒ కె.రత్నకుమారి, ఎఒ కెవిఎన్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌ను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్వర్ణ పంచాయతీల కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్నుల డిజిటలైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంత లక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆమె మంగళవారం మండలంలోని ర్యాలి, లొల్ల గ్రామపంచాయతీలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వర్ణ పంచాయితీ కార్యక్రమంలో భాగంగా ఇంటి పనులను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 22 మండలాలలో 285 గ్రామపంచాయతీలో ఈనెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని గ్రామపంచాయతీలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు శానిటేషన్ నిర్మూలన మరియు త్రాగునీరుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉపాధి హామీ చట్టం ద్వారా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఉపాధి హామీ చట్టం అమలాపురం క్లస్టర్ ఎపిడి డి.రాంబాబు పరిశీలించారు. భీమనపల్లిలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్డులను, ఎన్.కొత్తపల్లిలో కొబ్బరి చెట్లకు తవ్వుతున్న పళ్లాలను ఆయన పరిశీలించి ఉపాధి ఎపిఒ వి.రాజా మణికి, కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. ఎన్.కొత్తపల్లిలో పనుల రిజిస్టర్ లను కూడా ఆయన తనిఖీ చేశారు. అలాగే గొల్లవిల్లిలో అమత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన యల్లారమ్మ చెరువుగట్టు వద్ద రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎ. రామచంద్రరావు, ఉపాధి టిఎలు ఎం.దేవి పార్వతి, కె.బాలరాజు, సిఒలు జి,రవి, వి.నాగేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ ముళ్ళ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోడసకుర్రులో ఆధార్ నమోదు క్యాంప్

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకుర్రు గ్రామపంచాయతీలో సర్పంచ్ రొక్కల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆధార్ క్యాంప్ ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త ఆధార్ కార్డు నమోదు, పాత ఆధార్ కార్డ్ లో మార్పులను సరిచేస్తారన్నారు. ఈ కార్యమంలో పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దుర్గా శ్రీను, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రేడ్ 6 డిజిటల్ అసిస్టెంట్ యం.లోవరాజు బాబు పాల్గొన్నారు.

పాత్రికేయులకు అండగా ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - జగ్గంపేట

పాత్రికేయులకు అండగా ఎపిడబ్ల్యుజెఎఫ్ నిలుస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె.మున్ని, జిల్లా అధ్యక్షులు వి.నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మాణిక్యం కాంప్లెక్స్ వద్ద నియోజకవర్గ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో పాత్రికేయులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత 17 ఏళ్లుగా సంఘం అండగా నిలుస్తున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు అడబాల వీరభద్రరావు, కార్యదర్శి తుటుకు రామచంద్రరావు, గౌరవ అధ్యక్షులు నాయుడు, సతీష్, వట్టూరి వీరబాబు, కృష్ణ, అడబాల సుబ్బు, సూరిబాబు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ జూబిలీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దీనితో నెలరోజులు ముందుగానే క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ ప్రజలు ప్రారంభించారు. సంఘ ఉప కార్యదర్శి పిట్టా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అబ్రహం బైబిల్ గ్రంథం లోని ఏడు నక్షత్రాల గురించి వివరించారు. ఈ వేడుకల్లో సంఘకాపరి రెవ. బి.కిరణ్‌కుమార్, సంఘ కార్యదర్శి టి.సూర్యారావు, నాయకులు జి.అన్నపూర్ణ, ఐఆ.జీవన్‌కుమార్, పున్నమ చంద్రుడు, బి.జాన్ బాబు, బొద్దు రామారావు, బి.అమర్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

ప్రజాశక్తి - రాజానగరం

బంధుమిత్రుల మధ్య ఐక్యతకు వన సమారాధన దోహదం చేస్తాయని మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు వరద శేషారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పులపల్లి శివారులో కోలంక వరదా వారి కుటుంబ సభ్యులు వన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వరద వెంకట నాగేశ్వరరావు, వరద వెంకట రామమూర్తి, మండల వ్యవసాయ అధికారి అశోక్, ఆర్‌ఏ వేగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కె.గంగవరం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కె.గంగవరంలో మండల స్థాయి వ్యాసరచన వక్తృత్వ, చిత్రలేఖన అంశాల్లో విద్యార్థులకు పోటీలు జరిగాయి. మండల ఎస్‌సి ఉద్యోగుల సంక్షేమ సంఘం వీటి నిర్వహించింది. సుమారు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రాజ్యాంగం తదితర సామాజిక అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

'కొంకాపల్లి' విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్రస్థాయిలో జరిగిన సపక్ తక్రా పోటీలలో కొంకాపల్లి జె ఎన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు అప్పారి పవన్, పేరూరి రోహిత్, సాయి ఫణీంద్ర అండర్-14 రాష్ట్ర స్థాయి కాంస్య పథకాన్ని సాధించారు. ఇటీవల విజయవాడలో జరిగిన పోటీలలో విజయం సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున ఆడి, విజయం సాధించిన వీరు కార్యదర్శి, దేవా నంద రెడ్డి చేతులమీదుగా ఈ షీల్డ్ అందుకున్నారు. విద్యార్థులను అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఇ సలీం బాషా, డిప్యూటీ ఇఒ సూర్యప్రకాష్, సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, తదితరులు అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వి.నరసింహస్వామి, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ బాలస్వామి, ఇంగ్లీష్ లెక్చరర్ డా. బి.ఆశిష్ బాబు, మ్యాథ్స్ అధ్యాపకులు డా. వి.మంజులత, హిస్టరీ అధ్యాపకులు కరుణశ్రీలు రూ.25 వేల విలువైన రెండు జతల యూనిఫామ్ లను ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ గారపాటి త్రిమూర్తులు చేతులమీదుగా అందజేశారు. అనంతరం రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్ అంబేద్కర్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తేజ, శేఖర్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ తోట మురళీకష్ణ, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - మామిడికుదురు

పెదపట్నంలంక హైస్కూల్ కి చెందిన ఏడవ తరగతి విద్యార్థులు అల్లాడి హర్ష శ్రీ సాయి వినయ్, పొన్నమండ ఆనంద్ బంగారు బ్రాస్లెట్ ను పోగొట్టుకున్న రేఖపల్లి బాబీకి అందించి తమ నిజాయితీని నిరూపించుకున్నారు బ్రాస్లెట్ యజమాని బాబి వారికి ఒక్కొక్కరికి రూ.పదివేల నగదు బహుమతులు అందజేసివారి నిజాయితీని అభినందించారు సర్పంచ్ సుందరనేడి రాజేష్ కుమార్, హెచ్ఎం హరనాథ్, సలాది దొరబాబు విద్యార్థుల నిజాయితీకి అభినందించారు.